క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు తీసుకోండి

నిండ్ర: ఖరీఫ్ సీజన్‌లో పంటలకు ఆశించే చీడ పీడల నిర్మూలనకు సరైన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం కోరారు. బుధవారం మండలంలోని ఎలకాటూరులో సాగులో ఉన్న వేరుశనగ పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో పచ్చపురుగు, లద్దె పురుగులు ఆశిస్తాయని, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ఇదలా ఉంచితే, మండలంలో రైతులు తమిళనాడు నుంచి వేరుశనగ కాయలు కొని నెలక్రితమే విత్తారు. ఇక్కడ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయకపోవడంతో రైతులు తమకు అనుకూలమైన ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి సాగు చేయడం పరిపాటి.

గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించండి



బలిజకండ్రిగలో యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రజలు గ్రామాల్లో అన్నదమ్ముల్లా కలసి మెలసి ఉండాలని ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. బుధవారం డీఎస్పీ ఆదేశాల మేరకు బలిజకండ్రిగ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామ ప్రజలతో ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. చిన్నచిన్న గొడవలు పెట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా కలసి మెలసి ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత బాగా చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లాలని, మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మునస్వామి పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో నిమజ్జనం



అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఎల్‌బీపురంలో బుధవారం గంగమ్మ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు చేసి అమ్మవారి ఊరేగింపును ప్రారంభించారు. ఊరంతా అమ్మవారు కర్పూర హారతులు అందుకుని భక్తులకు అభయమచ్చారు. డప్పు వాయిద్యాల నడుమ ఊరేగారు. స్థానిక చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా విజయ్‌కుమార్



ఇన్‌చార్జి ఎస్‌ఈని కలిసిన ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈఈగా ఉన్న నరేంద్రకుమార్ తిరుపతి ఈఈగా బదిలీ అయ్యారు. అక్కడ ఉన్న విజయ్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయనకు ఇన్‌చార్జి ఎస్‌ఈగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. గతంలో తిరుపతి ఈఈగా ఉన్న విజయ్‌కుమార్ చిత్తూరు, తిరుపతి జిల్లాల ఇన్‌చార్జి ఎస్‌ఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. అనంతరం ఉద్యోగులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

అర్ధగిరిలో ఏరువాక పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి అభిషేకం, గంధం, తమలపాకులు, తులసిమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామికి పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. గంధంతో ప్రత్యేక అలంకరణలో స్వామి తేజోమయ రూపాన్ని వివిధ ప్రాంతాల భక్తులుదర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయంలో ఉచిత ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

ఆలయ ఆవరణలో ఉభయదారులు భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రోచ్ఛరణ చేస్తూ సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. హోమంలో ఆలయ ఈఓ హనుమంతురావు, ఉభయదారులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం

బుధవారం రాత్రి అర్చకులు ఉత్సవమూర్తికి అభిషేకం పూజల అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామికి పూజలు చేశారు. భక్తులు కాలక్షేపానికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఏడాది పాలనలో కూటమి అరాచకమే..!



రక్తగాయాలతో సర్పంచ్ సుధాకర్ (ఫైల్)

- దళితులే లక్ష్యంగా దాడులు, కేసులకే పెద్దపీట
- 'రెడ్‌బుక్' సేవలో తరిస్తున్న అధికార గణం
- విష సంస్కృతిని పోషిస్తున్న కూటమి



టీడీపీ నేతల దాడిలో గాయపడిన విక్కీ (ఫైల్)



గాయాలతో సర్పంచ్ భర్త మునస్వామి (ఫైల్)





పుల్లూరు దళితవాడలో ధ్వంసం చేసిన ద్విచక్రవాహనం(ఫైల్), తడుకుపేటలో కాల్చేసిన దళితవాడ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ద్విచక్రవాహనం (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి ఊసే లేకపోగా ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతులను నొక్కేయడం, దాడులు చేయడం, కేసులు బనాయించడమే లక్ష్యంగా పాలన చేస్తోందని ప్రజల నుంచి విమర్శలు మూటకట్టుకుంది. ఎంతసేపూ ప్రతిపక్షాల నాయకులు, సానుభూతిపరులే టార్గెట్‌గా అరాచక పాలన సాగిస్తోందని ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ఇవేవీ కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇక, తానేదో చరిత్రకారుడి లెవెల్లో రాసుకున్న 'రెడ్ బుక్'తో ప్రజాస్వామ్య వ్యవస్థనీ, విలువలనూ నారా లోకేష్ కాలరాస్తున్న వైనం సరికొత్త వికృత రాజకీయ పోకడలను చాటింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు కూటమి నాయకులు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినా వాటిని నెరవేర్చకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత మూటకట్టుకుంది. హామీలు నెరవేర్చాలని ప్రతిపక్షం, ప్రజా సంఘాలు నిలదీస్తుంటే, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక వ్యూహం ప్రకారం దాడులకు పూనుకోవడం, ఆస్తుల ధ్వంసం చేయడం, కేసులు బనాయించి జైలుకు పంపడమే తన అజెండాగా చేసుకుంది. నగరి, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల్లోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ఇళ్లపై రాళ్లు రువ్వి ఇళ్లద్దాలు, కార్ల అద్దాలు పగలగొట్టడాలు, శిలాఫలకాలు ధ్వంసం చేయడంతో ప్రారంభించి పార్టీ నాయకులపై దాడులు, కేసులు పెట్టి జైలుకు పంపడం విష సంస్కృతి కొనసాగుతోంది.

ఏడాది కాలంలో కూటమి నేతలు చేసిన అరాచకాల్లో మచ్చుకు కొన్ని

- నగరి మండలం తడుకు దళితవాడకు చెందినవారు గ్రామంలోకి రాకూడదంటూ టీడీపీ నేతలు చేసిన దాడిలో 8 మందికి గాయాలయ్యాయి. అలాగే వారికి చెందిన 6 బైకులు కాల్చేశారు. పైగా సర్పంచ్ కుమారుడు సత్యతో పాటు 13 మందిపై కేసులు పెట్టి ఏడుగురిని చిత్తూరు జైలుకు పంపారు. ఎవరో బ్యానర్ చింపేస్తే తడుకు దళితవాడకు చెందిన వారే చింపేశారంటూ ఆరుగురిపై కేసు పెట్టారు.
- నగరి మండలం దేశూరు అగరం దళితవాడలో వ్యక్తిగత తోపులాటలకు రాజకీయరంగు పులిమి మాజీ ఎంపీటీసీ సభ్యులు రంగనాథంతోపాటు ఆయన కుటుంబ సభ్యులు మొత్తం ఏడుగురిపై కేసులు బనాయించి ఐదుగురిని సత్యవేడు సబ్ జైలుకు పంపారు.
- విజయపురం మండలం ఎం.అగరంలో రెజల్యూషన్‌లో సంతకాల వ్యవహారంలో దళిత సర్పంచ్ సుధాకర్‌పై దాడిచేసి గాయపరిచారు. పైగా అతనిపైనే కేసు బనాయించారు.
- ఎస్‌ఆర్‌పురం పుల్లూరులో దళితవాడలో నివాసాలపై రాళ్లతో దాడిచేసి కిటికీల అద్దాలు పగలగొట్టడంతో పాటు, బైకును ధ్వంసం చేశారు.
- నగరి మండలం బీరకుప్పంలో ఆక్రమణల విషయమై ప్రశ్నించిన సర్పంచ్ భర్త మునస్వామిపై టీడీపీ నేతలు దాడిచేసి గాయపరిచారు.
- గంగాధర నెల్లూరు మండలం, రామానాయుడుపల్లెలో ఎవరో బ్యానర్ చించివేస్తే వైఎస్సార్‌సీపీకి చెందిన నలుగురిపై కేసులు బనాయించారు.
- సామాజిక మాధ్యమాల్లో ఈ అంశాలపై చర్చ జరగకుండా సోషల్ మీడియా కో–ఆర్డినేటర్లకు నోటీసులు ఇచ్చారు.





జైలు నుంచి ఇంటికి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధైర్యం చెబుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా (ఫైల్), ఆస్పత్రిలో సుధాకర్‌ను పరామర్శిస్తున్న రోజా (ఫైల్)

గంగమ్మా.. చల్లగా చూడమ్మా!



గంగమ్మ జాతరలో మాజీ మంత్రి రోజా



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీమంత్రి ఆర్కేరోజా

పుత్తూరు: మండలంలోని వేపగుంటలో బుధవారం గంగమ్మ జాతర వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. అందరినీ చల్లగా చూడమ్మా.. గంగమ్మ తల్లీ అని ప్రార్థించారు. తొలుత ఆమెకు జాతర కమిటీ, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, గ్రామ సర్పంచ్ గిరిజాప్రసాద్, మున్సిపల్ చైర్మన్ హరి, పట్టణ వైఎస్సార్ సీపీ ప్రెసిడెంట్ ఏకాంబరం, రూరల్ ప్రెసిడెంట్ అన్నా లోకనాథం, పార్టీ నాయకులు లక్ష్మణమూర్తి, యువరాజు, రాజా, వెంకటేష్, ఉదయ్, చిరంజీవి, కుట్టి, మురళీయాదవ్, రాంబత్తయ్య, గోవిందస్వామిరెడ్డి, దేవేంద్రరెడ్డి, చిరంజీవియాదవ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గరుడసేవలో ..

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గరుడ సేవలో మాజీ మంత్రి ఆర్కేరోజా స్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడ వీధుల్లో నేత్రపర్వంగా సాగిన గరుడవాహన సేవను తిలకించారు. ఆమె మాట్లాడుతూ, గరుడుని సేవా దృక్పథం, మాతృభక్తి, ప్రభుభక్తి, సత్యనిష్ఠ, నిష్కళంకత, ఉపకారగుణం సమాజానికి స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు. ఆమె వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న రోజా

నగరి: మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగలో బుధవారం గంగ జాతర వేడుకలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారిని ఊరి మధ్యలోని వేపాకు గుడిసెకు మేళతాళాలు, బాణసంచా మోత నడుమ తీసుకువచ్చారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కుంభాల కూడు నైవేద్యం సమర్పించారు. మాజీ మంత్రి ఆర్కేరోజా గంగమ్మను దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి ఆమెకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శశికుమార్, వెంకటేశ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు..

ప్రైవేటు అంబులెన్సుల ఆగడాలు అరికట్టండి

- ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

నగరి: ఏరియా ఆస్పత్రి నుంచి వివిధ ఆస్పత్రులకు పేషంట్లను తీసుకెళ్లే ప్రైవేటు అంబులెన్సుల ఆగడాలను అరికట్టాలని స్థానికులు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మంజులకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, నగరి ఆస్పత్రి నుంచి ఇతర ఆస్పత్రులకు మెరుగైన వైద్యం నిమిత్తం రెఫర్ చేసే వారిని ఆయా ఆస్పత్రులకు, అలాగే పరిస్థితి విషమించి మరణించిన వారిని వారి స్వగృహాలకు తీసుకెళ్లే ప్రైవేటు అంబులెన్సులను బాధితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. బాధితుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని వారి నుంచి అత్యధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తూ వారిని క్షోభకు గురిచేస్తున్నాయన్నారు. ప్రైవేటు అంబులెన్సులపై తీసుకుని పేషంట్లకు జవాబుదారీగా ఉండేలా చూడాలన్నారు. అలాగే, ధరల పట్టికను ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి కంటూ ఒక ప్రభుత్వ అంబులెన్సును ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైద్యులు కార్తిక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర





గంగమ్మకు సారె సమర్పిస్తున్న మాజీ సర్పంచ్ సారకాయలు, పూజలందుకుంటున్న గంగమ్మ

పుత్తూరు: పట్టణంలోని సీటీఆర్ నెత్తంలో బుధవారం గంగమ్మ జాతర సంబరాలు అంబరాన్ని అంటాయి. ఉదయం 4 గంటలకు అమ్మవారి ప్రతిష్ఠాపన అనంతరం ఆనవాయితీగా కోడి, మేకపోతు, దున్నపోతుల బలిదానం అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. సీటీఆర్ నెత్తం మాజీ సర్పంచ్ సారకాయలు కుటుంబ సమేతంగా వచ్చి సారె సమర్పించారు. ప్రసాదాల పంపిణీ చేశారు. మధ్యాహ్నం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కుంభం సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.. సాయంత్రం బలి తర్వాత గంగమ్మను నిమజ్జనం చేశారు. పుత్తూరు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రెండు రోజుల పాటు సీటీఆర్ నెత్తం జాతర సందడితో కళకళలాడింది. గ్రామ పెద్దలు గోవర్ధన్, మణి, రవి జాతర కార్యక్రమాలను పర్యవేక్షించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఐకేపీ, ఏపీఎం

పాలసముద్రం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయ ఆవరణలో మహిళలకు యోగాపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించి మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రం నుంచి పాలసముద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, డ్వాక్రా సంఘ సభ్యురాలు, సంఘమిత్ర పాల్గొన్నారు.

క్షతగాత్రులకు రోజా పరామర్శ



గాయాలపాలైన వారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: ఇటీవల నగరి నుంచి దామరపాకంకు వెళుతూ ఆటో బోల్తా పడడంతో గాయాలపాలైన వైఎస్సార్‌సీపీ శ్రేణులను మాజీ మంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. బుధవారం దామరపాకం దళితవాడకు వెళ్లిన ఆమె గాయాలపాలైన వారిని పేరుపేరునా పలకరించి, వారి పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, పార్టీ మండల అధ్యక్షులు తిరుమల రెడ్డి, రవికుమార్, లీలారామ్, పరంధామరెడ్డి, దామునాయుడు, సోము, గురుమూర్తి, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

వరదరాజులస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు



సత్యనారాయణ వ్రతమాచరిస్తున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధ శ్రీ భూదేవి సమేత వరదరాజులస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి పూజలను వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా అభిషేకం చేయించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సత్యనారాయణ వ్రతమాచరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సుమాను



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి



శ్రీరంగరాజపురంలో..

కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్జునుడి తపస్సు మాను భక్తులను ఎంతగానో అలరించింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి అర్జున వేషధారి మెట్టుమెట్టుకు పద్యాలు పాడుతూ తన వెంట తీసుకెళ్లిన నిమ్మకాయలు, విబూధి, పుష్పాలను భక్తులపైకి విసురుతూ తపస్సు మాను అధిరోహించారు. మహిళా భక్తులు తపస్సుమాను చుట్టూ అధిక సంఖ్యలో వరపడ్డారు. అర్జున తపస్సును తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అదేవిధంగా ఈశ్వరుడి కోసం అర్జునుడు చేసే తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లుగా భాగతారిణి భారతి ఆలపించారు. అంతకుముందు శివపార్వతులను నంది వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి శ్రీపాండురంగ కళానాట్యమండలి వారు ఉత్తరగోగ్రహణ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి బట్టువారిపల్లికి చెందిన కనకదుర్గ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అదే విధంగా కొల్లాగుంట గ్రామానికి చెందిన డాక్టర్ మునికుమార్, జ్యోతి దంపతులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని శ్రీరంగరాజపురం పాయికట్టు భారతంమిట్ట వద్ద జరుగుతున్న ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన అర్జున తపస్సు ఆకట్టుకుంది. ముందుగా ద్రౌపదీదేవి ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం ఒక గంటకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి, తపస్సు ఘట్టానికి సంబంధించిన పద్యాలను ఆలపిస్తూ తపస్సు మానును అధిరోహించారు. ఈ క్రమంలో పైనుంచి ఆయన విబూధి, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు తపస్సుమాను కింద పడుకుని స్వామివారిని వేడుకున్నారు. అర్జున తపస్సు ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈ పాల వ్యాను ఎవరిదో..?



పుత్తూరు: పట్టణ పరిధిలోని ఈశ్వరాపురం రోడ్డు పక్కనే ఓ పాల వ్యాను రెండు నెలలుగా పార్క్ చేసి ఉంది. ఏపీ 03 టిడి 9496 నంబర్‌తో ఉన్న ఈ వ్యానును వదిలేసి వెళ్లడం అనుమానాలకు తావిస్తోంది. రాత్రి వేళ గస్తీ తిరిగే పోలీసులు దీనిని పరిశీలించారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా ఉంటోంది. ఒకవేళ మరమ్మతుకు గురైతే ఒకటి రెండు రోజుల్లో అయినా వ్యానుకు సంబంధించిన వ్యక్తులు వచ్చి తీసుకెళ్లాలి కదా!? ఎవరూ ఎందుకు రాలేదన్న విషయంపై స్పష్టత లేదు. పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ అక్రమ రవాణాకు వినియోగించారా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.